

నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
10 నిజామాబాద్, మంగళవారం 10 జూన్ 2025 NIZAMABAD



హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇంటి ఎదుట పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులకు మూకుమ్మడి రాజీనామాలు చేసిన కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గ నాయకులు

## కాంగ్రెస్‌లో కల్లోలం

- సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోవడంపై ఆగ్రహావేశాలు
- పార్టీ పదవులకు మూకుమ్మడిగా బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతల రాజీనామాలు
- హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడి ఇంటి ఎదుట నిరసన
- జిల్లాలో కాంగ్రెస్ భూస్థాపితం అవుతుందంటూ హెచ్చరిక
- వచ్చే స్థానిక ఎన్నికల్లోగా మంత్రి పదవి ఇవ్వాలంటూ అల్టిమేటం




బోధన్, జూన్ 9 : రాష్ట్ర మంత్రివర్గం విస్తరణ జిల్లా కాంగ్రెస్‌లో కల్లోలం రేపింది. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, గతంలో రెండుసార్లు మంత్రిగా పనిచేసిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రివర్గం విస్తరణలో చోటు దక్కకపోవడంపై ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. కాంగ్రెస్ అధిష్టానం తీరుపై బోధన్ నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. నిరసన వ్యక్తంచేస్తూ తమ పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులకు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. సోమవారం హైదరాబాద్‌కు తరలివెళ్లి రాజీనామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ అధిష్టానం పెద్దలకు సమర్పించారు. హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో వెళ్లిన బోధన్ కాంగ్రెస్ నాయకులు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇంటికి వెళ్లారు. అప్పటికే ఆయన ఢిల్లీకి బయల్దేరడంతో ఇంటివద్ద నిరసన తెలిపి రాజీనామాలను వాచ్‌మన్‌కు సమర్పించారు. పీసీసీ అధ్యక్షుడితో పాటు ఏఐసీసీ తెలంగాణ రాష్ట్రం ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ అధిష్టానం పెద్దలకు ట్విట్టర్, వాట్సాప్‌ల ద్వారా తమ రాజీనామాలను పంపారు. సుదర్శన్‌రెడ్డికి వచ్చే స్థానిక ఎన్నికల్లోపు మంత్రి పదవి ఇవ్వకపోతే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితమయ్యే ప్రమాదముందంటూ కాంగ్రెస్ అధిష్టానానికి హెచ్చరికలను బోధన్ కాంగ్రెస్ నాయకులు పంపడం చర్చనీయాంశంగా మారింది.

### కాంగ్రెస్‌కు గడ్డుకాలమే..

వాస్తవానికి జిల్లా కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉన్న సుదర్శన్ రెడ్డికి రేవంత్‌రెడ్డి తొలి మంత్రివర్గంలోనే స్థానం దక్కుతుందని ఆయన అభిమానులు, అనుచరులు ఆశించారు. మంత్రివర్గం విస్తరణ తర్వాత కూడా పెద్దాయనకు మంత్రి పదవి ఇదిగో వస్తుంది.. అదిగో వస్తుందంటూ ప్రచారం జరిగింది. ఒక దశలో ఆయనకు హోంశాఖ మంత్రి పోర్ట్‌పోలియో ఖాయమైనట్లు సంకేతాలూ వచ్చాయి. మంత్రి కాకపోయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఆయనకు ఒక మంత్రికి ఇచ్చే ప్రొటోకాల్‌ను అనధికారికంగా ఇస్తూ వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 18 నెలల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం మంత్రివర్గం విస్తరణ జరగగా, ఈసారి మంత్రి పదవి ఖాయమని అంతా భావించారు. ఊహించనిరీతితో మంత్రివర్గం విస్తరణలో పెద్దాయనకు బెర్త్ దక్కలేదు. ఇదే కాంగ్రెస్ వర్గాల్లో ఆగ్రహావేశాలకు దారితీసింది. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం సుదర్శన్‌రెడ్డికి ఉన్నది. కీలకమైన భారీ నీటిపారుదలశాఖ, వైద్యవిద్యాశాఖ పోర్ట్‌పోలియోలను ఆయన నిర్వహించారు. మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఆ తర్వాత రెండుసార్లు ఓటమి చెందినప్పటికీ 2023లోజరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది నాలుగోసారి ఎమ్మెల్యే అయ్యారు. సీనియర్ నేతగా ఉన్న తమ నేత సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవికి అన్ని అర్హతలు ఉన్నాయని, అటువంటి నేతకు మంత్రివర్గంలో అవకాశం కల్పించకపోవడం శోచనీయమని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

నిన్నమొన్న కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇచ్చారంటూ విమర్శలు చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం.. ఇప్పటికే జిల్లా అభివృద్ధి కుంటుపడిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం మంత్రివర్గ విస్తరణ తీరును రాజకీయ పరిశీలకులు తప్పుబడుతున్నారు. ఈ పరిణామాలన్నీ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురయ్యే గడ్డుకాలాన్ని సూచిస్తున్నాయని అంటున్నారు. రాష్ట్ర మంత్రివర్గం విస్తరణతో జిల్లా కాంగ్రెస్‌లో.. ముఖ్యంగా బోధన్ కాంగ్రెస్ వర్గాల్లో ఏర్పడిన ప్రకంపనలు ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతున్నది..

### మంత్రి పదవి ఇవ్వకపోతే జిల్లాలో కాంగ్రెస్ భూస్థాపితమే

సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోతే రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాలో భూస్థాపితం అయ్యే ప్రమాదముందంటూ బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీ అధిష్టానానికి హెచ్చరికలు పంపడం ఆ పార్టీలో ఏర్పడిన కల్లోలానికి అద్దం పడుతుంది. సోమవారం హైదరాబాద్‌కు వెళ్లి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులకు రాజీనామాలు చేసిన వారు బహిరంగంగానే ఈ హెచ్చరికలు చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లోగా మంత్రిగా సుదర్శన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని, లేకపోతే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నిర్వీర్యం అవుతందన్న భయాందోళలను వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఇదే విషయాన్ని ఫోన్‌చేసి అల్టిమేటం ఇచ్చారు. రాజీనామాలు చేసిన ప్రముఖుల్లో కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు బి.గంగాశంకర్, పాషా మొయినుద్దీన్, మోబిన్‌ఖాన్, శ్రీనివాస్‌గౌడ్, డి.నాగేశ్వర్‌రావు, మందర్న రవి, పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.నరేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చీలం శంకర్, బోధన్ శివాలయం చైర్మన్ హరికాంత్‌చారి, పార్టీ నాయకులు తూము శరత్‌రెడ్డి, అల్లె రమేశ్, చిన్నా, అశోక్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న ఇందల్వాయి గ్రామస్తులు

## రాజన్న కోడెలు మరణిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కవిత

ఇందల్వాయి, జూన్ 9 : వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించి కోడెలు మృతిచెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం ఆమె నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండల కేంద్రంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించారు. గతంలో ఎమ్మెల్సీ సొంతంగా ఆలయ ప్రహరీ నిర్మాణం కోసం రూ. 5 లక్షల నిధులు అందజేశారు. పనులు పూర్తి కావడంతో ప్రహరీ వద్ద శిలాఫలకం ఆవిష్కరించి మాట్లాడారు. ఆలయాలపై ఏ మాత్రం శ్రద్ధ ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో రాష్ట్రంలోని ఆలయాలకు రూ. 2వేల కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అన్ని గ్రామాల్లో చిన్న ఆలయాలను కూడా అభివృద్ధి చేశారన్నారు. ఎన్నికల సమయంలో మహిళలు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ నాయకులు మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలుచేసేవరకూ తాను ముందుండి పోరాటం చేస్తానన్నారు. కళ్యాణలక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పలు వురి పరామర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం వద్దకు వెళ్లి ఆయా కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు మాజీ ఎంపీపీ రమేశ్‌నాయక్, పాశం కుమార్, మాజీ ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్, మాజీ సర్పంచులు నోముల లక్ష్మారెడ్డి, చందర్‌నాయక్, అంబర్‌సింగ్, విండో డైరెక్టర్ నామాల గంగాధర్, మాజీ డైరెక్టర్ సంజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అశ్విని, మాజీ కో-ఆప్షన్ సభ్యులు కుర్షిద్ పాషా నాయకులు ఉన్నారు.

## మల్టీజోన్ పరిధిలో సీఐలకు స్థానచలనం

వినాయక్‌నగర్, జూన్ 9: మల్టీజోన్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారి జాబితాలో హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, రామగుండం, మెదక్ జిల్లాలకు చెందిన సీఐలు ఉన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో డిచ్‌పల్లి సీఐగా పనిచేస్తున్న కొంక మల్లేశ్‌ను ఐజీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో ట్రాన్స్‌కో విభాగంలో పనిచేస్తున్న కందిరి వినోద్‌ను డిచ్‌పల్లి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## జిల్లా, మండల అధికారులకు షోకాజ్ నోటీసులు

కామారెడ్డి, జూన్ 9 : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన జిల్లా, మండల అధికారులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కామారెడ్డి అడిషనల్ డీఆర్డీవో మురళీ కృష్ణ, డీపీఎం రమేశ్ విధుల్లో నిర్లక్ష్యం వహించారని, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బీబీపేట్, పిట్లం, తాడ్వాయి ఏపీఎంలు బాల పోచయ్య, శిరీష, మనోహర్‌కు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

## విషాదం !

- రోడ్డు ప్రమాదంలో తాత, మనవడు మృతి
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకుల ఆందోళన



రాములు (ఫైల్)



శ్రీయాంశ్ (ఫైల్)

రాజంపేట్, జూన్ 9: రోడ్డు ప్రమాదంలో తాత, మనవడు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బస్వన్నపల్లి గ్రామానికి చెందిన దోమకొండ రాములు (50) తన మనవడు కొంపల్లి శ్రీయాంశ్ (4)కు మండల కేంద్రంలోని ఓ దవాఖానలో చికిత్స చేయించుకొని తిరిగి బస్వన్నపల్లి గ్రామానికి ద్విచక్రవాహనం (టీవీఎస్ ఎక్సెల్)పై బయల్దేరాడు. మార్గమధ్యంలో పెద్దాయిపల్లి గేటు వద్ద గుండారం నుంచి కామారెడ్డి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తాత, మనవడు అక్కడికక్కడే మృతిచెందారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందంటూ మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తాత, మనవడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎస్సారెస్పీలో పెరుగుతున్న నీటిమట్టం

మోర్తాడ్, జూన్ 9: ముందస్తు వర్షాలతో వరద రావడంతో నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పెరుగుతున్నది. సోమవారం ప్రాజెక్ట్‌లో 12.991 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. గతేడాది ఇదే రోజు ప్రాజెక్ట్‌లో 7.568 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండేది. సోమవారం ప్రాజెక్ట్‌లోకి 1,679 క్యూసెక్కుల వరద రాగా, 672 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 1062.40అడుగుల (12.991టీఎంసీలు)నీటి నిల్వ ఉన్నది. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, తాగునీటి కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. ఇందులో కోరుట్ల, జగిత్యాల్‌కు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్‌కు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాం తాలకు 107 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 341 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.



కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

## ఈదురుగాలుల బీభత్సం

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

లింగంపేట(తాడ్వాయి)/ కామారెడ్డి/రెంజల్, జూన్ 9: ఉమ్మడి జిల్లాలో సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. పలు మండలాల్లో ఆదివారం రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తున్నది. దీంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లోని పలు ప్రాంతాలు చెరువులను తలపించాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. రోడ్లన్నీ జలమయ మయ్యాయి. నగరంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. కామారెడ్డిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రహరీ కూలిపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించారు. సబ్ స్టేషన్ వద్ద కురుస్తున్న వర్షానికి విద్యుత్ స్తంభం వంగిపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తాడ్వాయిలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎడ్రపహాడ్, రెంజల్ మండల కేంద్రంతో పాటు నీలా క్యాంపు శివారులో వర్షం కారణంగా చెట్లు రహదారిపై పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



రెంజల్ శివారులో కూలిన చెట్టు



తాడ్వాయిలో విరిగిన స్తంభం

### ఈదురుగాలులకు రేకులషెడ్డుపై కూలిన చెట్టు

### లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి

వినాయక్‌నగర్, జూన్ 9 : నగరంలో సోమవారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులు, కురిసిన వర్షానికి పూలాంగ్ ప్రాంతంలోని యాదగిరిబాగ్ వద్ద ఓ భారీ వృక్షం నేలకొరిగింది. అక్కడే ఉన్న కల్లు బట్టీ రేకులషెడ్డుపై పడడంతో రేకులు, చెట్టు కింద ఉన్న వ్యక్తి అక్కడే కూరుకుపోయి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. ఆ ప్రాంతమంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయి చీకటిమయంగా ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురయ్యాయి. మృతుడిని ఆర్యనగర్‌కు చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గా గుర్తించారు.



కామారెడ్డి పట్టణంలో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు



కామారెడ్డిలో కూలిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి

వివరాలను వెల్లడించిన కామారెడ్డి అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి

కామారెడ్డి, జూన్ 9 : జాతీయ రహదారులతోపాటు కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో చోరీలకు పాల్పడిన అంతర్‌జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు కామారెడ్డి అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఠాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చోరీలకు పాల్పడుతున్న నాందేడ్‌కు చెందిన నాందేవ్ అలియాస్ రాంకిషన్ బోస్లే, రాందాస్, కర్ణాటకకు చెందిన క్రిష్ణ బాబు షిండే అలియాస్ క్రిష్ణకుమార్ షిండే, నాందేడ్‌కు చెందిన రాథోడ్ అజిత్ రమేశ్ అలియాస్ అజయ్, నాందేడ్‌కు చెందిన రిసీవర్ గజానంద్ రామారావును అరెస్టు చేసినట్లు తెలిపారు. మరొక వ్యక్తి భాస్కర్ చౌహాన్ అలియాస్ భాస్కర్ దాదా రావు చౌహాన్ పరారీలో ఉన్నాడని త్వరలోనే పట్టుకుంటామని అన్నారు. ఈ దొంగల ముఠా సభ్యులు రహదారులపై ఆగి ఉన్న వాహనదారులను లక్ష్యం చేసుకొని వారిపై మారణాయుధాలతో దాడి చేసి దారి దోపిడీకి పాల్పడుతుంటారని తెలిపారు. అలాగే రహదారులకు సమీపంలో ఉన్న తాళం వేసి ఇండ్లల్లో చోరీ చేస్తుంటారని అన్నారు. ఈ ముఠా సభ్యులను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సోమవారం మొండిసడక్ చౌరస్తా వద్ద గాంధారి పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా, ముగ్గురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై బాన్సువాడ నుంచి గాంధారి వైపు వస్తుండడాన్ని గమనించి వారిని పట్టుకొన్నట్లు తెలిపారు. విచారించగా నలుగురు సభ్యులు ఒక ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు.

వారితోపాటు సొత్తును కొనుగోలు చేసే వ్యక్తి గజానంద్ రామారావును కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని పేర్కొన్నారు. నిందితుల నుంచి మూడు తులాల బంగారం, 12 తులాల వెండి, రెండు కత్తులు, ఒక ఇనుపరాడ్డు, రెండు టార్చిలైట్లు, ఒక స్పానర్ , మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, రంజిత్, ఉస్మాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, రాజేందర్, శ్రావణ్, లక్ష్మీకాంత్, స్వామి, మైసయ్య, రవి, సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర, అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి అభినందించారు.